పల్లెల్లో పాలన అస్తవ్యస్తం

- నిధుల లేమితో పరిష్కారం కాని సమస్యలు
- అప్పులు తెచ్చి నెట్టుకొస్తున్న కార్యదర్శులు
- పాలకవర్గం లేకపోవడంతో రాని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు
- పారిశుధ్య కార్మికుల జీతాలు మాత్రం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22.5 కోట్లకు గాను ఇచ్చింది రూ.6.5 కోట్లే..


పోల్కంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి మాట అటుంచితే సమస్యలే పరిష్కారం కావడం లేదు. చాలా చోట్ల తాగునీరు, పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయి. సర్పంచుల పదవీ కాలం గత ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. దాదాపు 15 నెలలుగా కార్యదర్శులు అప్పులు తెచ్చి, పరిపాలన సాగిస్తున్నారు. ఇటీవల వసూలు చేసిన పన్నుల నుంచి కొంత డబ్బు ఖర్చు చేసినా గ్రామాలలో కుంటుపడ్డ అభివృద్ధి పనులకు అవి ఏ మాత్రం చాలడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నెలకు రూ 1.5 లక్షలు విడుదల చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాలకు ప్రతీ నెల రూ.1.5 లక్షలు విడుదల చేయాల్సి ఉంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 15 నెలలు కావస్తున్నా నేటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) నుంచి మాత్రం పంచాయతీ కార్మికుల జీతాలు మాత్రం విడుదల చేసింది. మొత్తం రూ22.5 లక్షలకు గాను.. వర్కర్ల జీతాలకు రెండుసార్లు రూ.6.25 లక్షలు విడుదల చేసింది. అదికూడా కార్మికులు తమకు వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలతో కలిసి పోరాటం చేయడంతో విడుదల చేసింది. కేంద్రం విడదల చేయాల్సి 15వ ఆర్థిక సంఘం నిధులు పాలకవర్గం లేని కారాణంగా విడుదల చేయడం లేదు. పాలకవర్గం బాధ్యతలు చేపడితే తప్ప ఆ నిధులు వచ్చే పరిస్థితి లేదు. అటు కేంద్ర నిధులు రాక, ఇటు రాష్ట్రం నిధులు విడుదల చేయక గ్రామ పంచాయతీల నిర్వహణ ప్రత్యేక అధికారులకు తలకుమించిన భారంగా మారింది

ట్రాక్టర్‌ల ఈఎంఐలు కట్టేందుకూ అవస్థలు

గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతీ పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. నిధులు ఉన్న పంచాయతీలు ఒకే సారి డబ్బు చెల్లించగా, నిధులు లేక పంచాయతీలు బ్యాంకు రుణం ద్వారా కొన్నాయి. రుణంపై కొనుగోలు చేసిన పంచాయతీలు ఇప్పుడు నెల నెల లోను కట్టలేక ఇబ్బందులు పడుతున్నాయి. రెవెన్యూ ఉన్న గ్రామాలు లోన్లు చెల్లిస్తుండగా, లేని గ్రామాలు చెల్లించడం లేదు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలు నెలకొన్నాయి. తమ స్థాయిలో కార్యదర్శులు అప్పులు తెచ్చి, ఖర్చు చేస్తున్నా పూర్తిగా పరిష్కారం కావడం లేదు.

కుంటుపడుతున్న అభివృద్ధి



పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు నిర్వహణ కోసం అప్పుల పాలవుతున్నారు. రేపోమాపో ఎన్నికలు నిర్వహిస్తామని హడావుడి చేసిన ప్రభుత్వం వాయిదా వేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బాధ్యతలు కార్యదర్శులపైనే వేయడంతో వారు ఒత్తిడికి గురవుతున్నారు.

\- వెంకటయ్య గౌడ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు

నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశం



గ్రామాలలో పాలకవర్గం ఏర్పాటు అయితేనే కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు ఇస్తుంది. ఎన్నికల వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులతోనే గ్రామలలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా వారి ఖాతాల్లో జమ చేసింది. రెవెన్యూ ఉన్న గ్రామాలలో వచ్చిన నిధులతో పనులు చేపడుతున్నారు. లేని గ్రామాలలో కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసినందున నిధులు త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది.

\- పార్థసారథి, డీపీవో

రేపటి నుంచి బావోజీ బ్రహ్మోత్సవాలు

- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మద్దూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గిరిజనుల ఆరాధ్యదైవం గురులోక మాసంత్ ప్రభు(బావోజీ) బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు జరుగనున్నాయి. వాబోజీ సమాధి అయిన ఈ గ్రామంలో ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు


బావోజీ దేవాలయం

కార్యక్రమాల వివరాలు..


బావోజీ సమాధి

11న శుక్రవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, రాత్రికి బంజారా బ్రహ్మోత్సవ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 12న శనివారం గురులోక మాసంత్, అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటలను స్వామివారి మహారథోత్సవం, మహా ఊరేగింపు ఉంటాయి. 13న ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, హోమం, ప్రత్యేక పూజలు ఉంటాయి. 14న సోమవారం ఉదయం 7 గంటలకు కాళికాదేవి పల్లకీ సేవ, హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు.

దర్శించుకోనున్న ముఖ్యమంత్రి

సొంత నియోజకవర్గంలో జరుగనున్న బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై బావోజీని దర్శించుకోనున్నారు. పర్యటన అధికారిక ప్రకటన త్వరలో ఖరారు కానుందని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రత్యేక బస్సులు..

బావోజీ జాతరకు వచ్చే భక్తుల కోసం నారాయణపేట, కోస్గి, తాండూరు, పరిగి, కొడంగల్, మద్దూర్ తదితర బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ సిక్తా పట్నాయక్


మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తపల్లి: బావోజీ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ ఆవరణలో పలు శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి సమీక్ష చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. వీఐపీ మేనేజ్‌మెంట్‌ను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. శానిటేషన్ కోసం 300 మంది కార్మికులు మూడు షిఫ్టులుగా పని చేస్తారని డీఎల్‌పీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. తిమ్మారెడ్డిపల్లిలో మొబైల్ నెటవర్క్ అంతరాయం ఉండటంతో జాతర నాలుగు రోజులు వాకిటాకీలు ఇవ్వాలని డీఎల్‌పీవో ఎస్పీని కోరారు. మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ తెలిపారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అదనంగా మొబైల్ టాయిలెట్‌లను ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు జరుగకుండా పోలీసులు మఫ్టీలో నిఘా ఉంచుతారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్ నాయక్, పీఆర్ అధికారి విలోక్, ఆర్టీసీ డీఎం లవణ్య, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ సైదులు, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.

విద్యానిధికి.. రూ.10 లక్షలు విరాళం

- అందించిన టీఎన్‌జీవో ఫోరం


ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ద్వారా చెక్కును కలెక్టర్ విజయేందిర బోయికి అందిస్తున్న టీఎన్‌జీవో ఫోరం సభ్యులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ విద్యానిధికి జిల్లా టీఎన్‌జీవో(తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల) ఫోరం నుంచి రూ.10,69,700 విరాళాన్ని బుధవారం అందించారు. అందుకు సంబంధించిన చెక్కును బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ విజయేందిర బోయికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ మహబూబ్‌నగర్ విద్యానిధికి వచ్చిన ప్రతి పైసా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి పోటీ పరీక్షల ప్రిపరేషన్‌కు ఖర్చు చేస్తామన్నారు. టీఎన్‌జీవో ఫోరం తరపున రూ.10 లక్షల పైచిలుకు అందించడం అభినందనీయమన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్, ఫోరంలోని 200 మంది ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ విద్యానిధికి తాను ప్రతీ నెల తన జీతంలో రూ.లక్ష ఇస్తున్నట్లు తెలిపారు. పోలీస్ డిపార్ట్‌మెంటు వారు ఎస్పీ ఆధ్వర్యంలో రూ.3 లక్షల చెక్కును అందించారన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి తనవంతు సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. పీఆర్‌టీయూ కూడా విరాళం అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. విద్యావంతులు, మేధావులు, వ్యాపారవేత్తలు ముందుకు రావాలన్నారు. మంచి అనేది మనుషుల్లో కను మరుగు కాలేదని ఈ రోజు నిరూపణ అయ్యిందన్నారు. అంతకు ముందు టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ మీరిచ్చిన పిలుపుతోనే 200 మంది ఉద్యోగులు ముందుకొచ్చి విరాళాలు ఇచ్చారన్నారు. టీఎన్‌జీవో నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎస్ మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, టీపీసీసీ కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు

- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్


మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలతోనే జ్ఞానం వస్తుందని, సామాజిక మాధ్యమాలతో ఉపయోగం లేదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థలో 2025-26 సంవత్సరంలో సమూలమైన మార్పులు చేస్తున్నామన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వాణిజ్యశాస్త్రం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు పాత్ర, సమస్యలు-అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు యువత కీలకమన్నారు. 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవంతో ప్రపంచం అభివృద్ధి చెందగా, 21వ శతాబ్దంలో వచ్చిన సాంకేతిక విప్లవంతో ప్రపంచంలోనే భారతదేశం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. 2030 నాటికి భారతదేశం 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందన్నారు. ఆరోగ్యం, విద్య, సాంకేతిక విధానాలకు ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తే అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సిలబస్‌లో మార్పులు తెస్తామన్నారు. ఆన్‌లైన్‌లో 55, ఆఫ్‌లైన్‌లో 32 పత్రసమర్పణలు చేశారన్నారు. వీరిలో 30 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. యలమంచిలి రామకృష్ణ, రాజ్‌కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ నాగలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, కో కన్వీనర్ సులేమాన్, సభ్యులు శంకర్, వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు నరసింహరావు, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సదాశివయ్య, వేణు, రుక్యాభాను, రాజేశ్వరీ, పుష్పలత, ప్రవీణ్‌కుమార్, మాధురి, వెంకటయ్య, నాగరాజు, ప్రతాప్, నందకిశోర్, వెంకటేశ్వర్లు, విక్రమ్, రజనీ, లత పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని, తెలంగాణ తెచ్చిన పార్టీగా, తెచ్చిన తెలంగాణను పదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పార్టీగా ప్రజల మన్ననలను పొందిందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వరంగల్‌లో సభ ఉన్నందున మనకు దూరప్రాంతం కావడంతో ఉదయం 9 గంటలకే ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లాలన్నారు. తెలంగాణ సాధించిన తరువాత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన ఏ విధంగా సాగిందో ప్రజలు చూశారన్నారు. ఈ పదిహేను నెలల కాంగ్రెస్ పాలనను చూస్తున్నారని, భవిష్యత్తులో ఏ పార్టీకి అధికారం ఇవ్వాలో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీనే భవిష్యత్తులో అధికారంలో వస్తుందన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కోరమోని నర్సింహులు, శివరాజు, గంజి ఎంకన్న, తాటి గణేష్ పాల్గొన్నారు.


← చలో వరంగల్ సభ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి

- ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 9,(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మెట్రో గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ జిల్లా పగ్గాలను నూతన అధ్యక్షుడు సత్య యాదవ్‌కు అప్పగించారని, క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల వారిని కలుపుకొని పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లను గెలిపించుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు వల్ల ఏ ఒక్క ముస్లింకు లాభం జరగలేదన్నారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం భూములను అమ్ముకున్నదని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి సైతం అదే విధానాలను అవలంభిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా అర్హులకు ఇవ్వాలన్నారు. అధ్యక్షుడు సత్య యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు. అంతకు ముందు పట్టణంలో కార్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగురావు, నాయకులు పగడాకుల శ్రీనివాస్, కొండయ్య, శ్రీనివాస్, లాహోటి, లక్ష్మీకాంత్‌రెడ్డి భాస్కర్, రఘురామయ్యగౌడ్ పాల్గొన్నారు.

అమరచింత ఘటనపై సీఎం స్పందించాలి

అమరచింత ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగిన విషయమై అమరచింత, ఆత్మకూర్ ఆస్పత్రుల సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఎంపీ అరుణ అన్నారు. బుధవారం ఆమె నారాయణపేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రసవ సమయంలో డాక్టర్లు లేక సిబ్బంది చేసిన ప్రసవంలో బిడ్డను తల, మొండెం వేరు అయిన ఘటన హృదయవిదారకరమని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 21ని రద్దు చేయాలని హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న 12 యూనివర్సిటీల 900 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున ఖండిస్తున్నామన్నారు.

రేపటి నుంచి లింగమయ్య దర్శనం



సలేశ్వరం దర్శనానికి వెళుతున్న భక్తులు (ఫైల్)



మోకాళ్ల కుర్వ వద్ద నడిచివెళుతున్న భక్తులు(ఫైల్)

3 రోజులు జరగనున్న సలేశ్వరం ఉత్సవాలు

అచ్చంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో కొండ దిగువన 1,000 అడుగుల లోతులో కొలువైన లింగమయ్య రేపటి నుంచి దర్శనం ఇవ్వనున్నారు. స్వామి వారి దర్శనం చేసుకోవాలంటే సాహస యాత్ర చేయాల్సిందే.. స్వామివారిని దర్శించుకునేందుకు సామాన్యులైన సంపన్నులైన కాలినడకనే వెళ్లాల్సి ఉంది. ఇక్కడ చెంచులే పూజలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా లింగమయ్య దర్శనం కోసం తరలివస్తారు. ప్రతీ ఏడాది చైత్రశుద్ధ పౌర్ణమి రోజు మాత్రమే స్వామి దర్శన భాగ్యం కలుగుతుంది. ఏడాదిలో మూడు రోజులు (ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు) జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ జాతర ఏర్పాట్లపై ఇప్పటికే నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. లింగమయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

కొండ గుహలలో కొలువుదీరిన లింగమయ్య..

వెయ్యి అడుగుల లోతులో కొండగుహలో కొలువుదీరిన లింగమయ్యను దర్శించుకోవాలంటే 200 అడుగుల ఎత్తు ఉన్న మోకాళ్లకురువ దిగాలి. దాదాపు కిలోమీటరుకు పైగా కొండవాలు వెంబడి రాళ్ల రప్పలు దాటుకుంటూ నడవాలి. మరో 100 అడుగుల ఎత్తు ఉన్న కొండను దిగి దాదాపు 700అడుగుల లోతులో ఉన్న కొండ లోయలోనికి దిగితే లింగమయ్య సన్నిధికి చేరుకుంటాము. ప్రతీ ఒక్కరు చేతిలో కర్రలు లేనిది అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి... ఈ పరిస్థితిలో భక్తులు లింగమయ్య నామస్మరణ కొండలు ప్రతిధ్వనిస్తాయి. సలేశ్వర సమీపంలోని జలధార వివిధ ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, ఈ నీటిని తాగడం వలన రోగాలు దరిచేరవని భక్తులు విశ్వసిస్తారు. అందుకే పోటీపడి జలధార వద్ద నీటిని పట్టుకుంటారు.

దారిపొడవునా అన్నదానం

సలేశ్వరానికి వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దారిపొడవునా అన్నదానం చేస్తుంటారు. లింగాలలో జరిగే బ్రహోత్సవాలలో సహజంగా విమానరథోత్సవాన్ని దర్శించుకొని భక్తులు సలేశ్వర క్షేత్రానికి బయలుదేరుతారు. ఎంతో ఎండ వేడిమి ఉన్నా.. తాగడానికి నీరు లేకున్నా ఉత్సాహంతో భక్తులు లింగమయ్య దర్శనానికి వస్తుంటారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సలేశ్వర జాతరకు వచ్చే భక్తుల రవాణ సౌకర్యార్థం అచ్చంపేట, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి 25 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రసాద్ తెలిపారు. అంతే కాకుండా కల్వకుర్తి, మహబూబ్‌నగర్, నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగుడ ,హైదరాబాద్ నుంచి కూడా ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు.

సలేశ్వరం ఎలా వెళ్లాలి..

హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి ఫరహాబాద్ చౌరస్తాకు చేరుకోవాలి. అక్కడి నుంచి అటవీ మార్గంలో 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే సలేశ్వరం చేరుకోవచ్చు. అచ్చంపేట రంగాపూర్, మన్ననూర్ మీదుగా 70 కిలో మీటర్లు ప్రయాణిస్తే సలేశ్వరం చేరుకొవచ్చు. మరోమార్గం అచ్చంపేట నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగాల చేరుకొని అక్కడి నుంచి, అప్పాయపల్లి మీదుగా గిరిజగుండాల వరకు 15 కిలోమీటర్లు వాహనాలలో ప్రయాణిస్తే.. తదుపరి అక్కడి నుంచి మరో 15 కిలోమీటర్లు కాలినడకన సలేశ్వరం చేరుకోవచ్చు.

బహుజనుల రాజ్యాధికారమే భవిష్యత్తు పోరాట లక్ష్యం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్
- సిద్ధాంతంతో పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమన్న ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాసీం



బిజినేపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ తెలుగువిభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాసీం

బిజినేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో, రాష్ట్రాల్లో బహుజనుల రాజ్యాధికారమే భవిష్యత్తు పోరాట లక్ష్యంగా ముందుకు సాగుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని బీసీ సంఘం నాయకులు గంగనమోని కిరణ్, నాయినోళ్ల బాల్‌రాజు గౌడ్, దళిత బహుజన సంఘం రాష్ట్ర నాయకుడు మంగి విజయ్‌లతో కలిసి ఆవిష్కరించారు. పూలే విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే చట్ట సభల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆయా పార్టీలు సీట్లు కేటాయించకపోతే అన్ని స్థానాల్లో బహుజనులు పోటీలో ఉండి గెలిచి సత్తా చాటాలని అన్నారు. అనగారిన వర్గాల ప్రజలంతా ఏకతాటిపై వచ్చి ఐకమత్యంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకుడిని ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించుకుంటేనే రాజ్యాధికారం మన చేతుల్లో ఉంటుందన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ సిద్ధాంతంతో పోరాటం చేస్తేనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. సిద్ధాంతం రూపొందించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించు కోవడంతోనే ఆగిపోకుండా ఆయన చూపినబాటలో సాగాలన్నారు. అంతకు ముందు ప్రొఫెసర్లు డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, డాక్టర్ సాయి బాబా, బీసీ రాష్ట్ర నాయకుడు దిలీపాచారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడారు. గిద్దె రాంనర్సయ్య, రేలారే గంగ, జయప్రకాశ్, డప్పు లక్ష్మణ్, రాజు, విజయకాంత్‌ల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. పూలే విగ్రహావిష్కరణ మహోత్సవానికి ఆరు వేల మందికి పైగా బహుజనులు హాజరై విజయవంతం చేయడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. మండల బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంత్ గౌడ్, సత్యశీల సాగర్, రామన్ గౌడ్, రఘుబాబు, రాము నాయక్, గంగారం అశోక్, గోవిందు, నాగరాజు, గంగనమోని తిరుపతయ్య, శ్రీను, తుమ్మల అల్లోజీ, కరిగళ్ల దశరథం, విల్సన్, దేశెట్టి రాజేష్, మల్లేష్ గౌడ్, పృధ్వీరాజు, సుదర్శన్, దామోదర్, కిషోర్, విజయ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



పల్లకిలో గరుడ సేవా వాహనంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున పల్లకిలో గరుడసేవ వాహనంలో ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, తులసినామార్చన, వేద పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామి, ముక్కిడి పోచమ్మతల్లి, పరశురాముడు, శివదత్తాత్రేయ, గుట్ట దిగువన కొలువైన మైసమ్మతల్లిని భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ నిరంజన్, ఆలయ పూజారులు డేరం మురళీధర్ శర్మ, డేరం లక్ష్మణశర్మ, డేరం వేణుశర్మ, డేరం ఆనందశర్మ, డేరం గోపిశర్మ, డేరం భాస్కరశర్మ, డేరం ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగే పెద్దరథోత్సవం ఏర్పాట్లకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయ అధికారిని పీఎస్ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో ఖాళీ ఉన్న పోస్టుల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. రసాయన శాస్త్రం 4, భౌతిక శాస్త్రం 2, చరిత్ర 1 , కామర్స్ 1, తెలుగు 1, ఆంగ్లం 1, కంప్యూటర్ సైన్స్ 1, అర్థశాస్త్రం 1, లైబ్రేరియన్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 17న తిరుమల హిల్స్‌లోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో డెమో ఉంటుందని, దరఖాస్తు పత్రాలు ఈనెల 10 నుంచి ఇక్కడే పొందవచ్చని తెలిపారు.

గర్వపడేలా బీఆర్ఎస్ రజతోత్సవాలు

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి వెల్లడి

కొల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సమాజం గర్వించేలా బీఆర్ఎస్ రజతోత్సవాలు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో వరంగల్ జిల్లా పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కొల్లాపూర్ పట్టణంలో గోడలపై మాజీ ఎమ్మెల్యే వాల్ రైటింగ్ రాశారు. ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి రావా లని ఆయన పిలుపునిచ్చారు.

● పెంట్లవెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ చిట్టెమ్మ ఇంటి దగ్గర బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, రాజేష్, సురేందర్ గౌడ్, నరేందర్‌రెడ్డి, అబ్దుల్లా, సత్యం, రవి, ఎస్‌కె ఖాజా, బ్రహ్మం పాల్గొన్నారు.

పాయలా.. మారిందిలా..

- అడుగంటిన సోమశిల కృష్ణానది
- నాడు జలకళ.. నేడు వెలవెల
- ఉమ్మడి జిల్లా వాసులకు వేసవిలో తప్పని తాగు, సాగునీటి కష్టాలు
- ఈ ఏడాది ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా 47 టీఎంసీల నీటి వినియోగం
- మరో వారం రోజుల వరకు కొనసాగనున్న ఎంజీకేఎల్ఐ నీటి పంపింగ్



అడుగంటిపోయిన సోమశిల కృష్ణానది దృశ్యాలు

కొల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైన వెంటనే వరద జలాలతో నిండు కుండలా కళకళలాడే సోమశిల కృష్ణానది వేసవి ఆరంభంలోనే అడుగంటి పోయి వెలవెలపోతున్నది. పాయలా మారి ప్రవహిస్తుండటం చూసి కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు, పర్యాటకులు విస్తుపోతున్నారు. మరో మూడు నెలల పాటు ఉండే వేసవిలో తాగు, సాగు నీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. గడిచిన వర్షాకాలం ప్రా రంభం మొదలు.. నేటి వరకు ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 47 టీఎంసీలు వినియోగించినట్లు అధికారులు పేర్కొం టున్నారు.

ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఒకటి, రెండు, నాలుగో మోటార్‌ల ద్వారా నీటి వినియోగం యథావిధిగా కొనసాగుతూనే వచ్చింది. మరో వారం రోజుల పాటు నీటి సరఫరా కొనసాగుతుంది. ప్రస్తుతానికి తాగు, సాగు నీటి కష్టాలు ఉండవని అధికారులు చెబుతున్నా.. వచ్చే మూడు నెలల పాటు ఉమ్మడి జిల్లా వాసులకు తాగునీటి కష్టాలు మాత్రం తప్పవని పలువురు పేర్కొంటున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రం పరిధిలోని ఎల్లూరు మిషన్ భగీరథ పథకానికి ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అవసరాల కోసం నీటి పంపింగ్ చేస్తారు. అక్కడ ఫిల్టర్ చేసి నీటిని ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో 19 మునిసిపాలిటీలకు 18 నియోజకవర్గాల్లో ఉన్న 88 మండలాలకు ఆరు జిల్లాల పరిధిలో ఉ న్న 4వేల ఆవాసాలకు ఇక్కడి నుంచే మిషన్ భ గీరథ పథకం ద్వారా నీటి పంపిణీ కొనసాగుతుం ది. ప్రస్తుతం ఎల్లూరు మిషన్ భగీరథ పథకానికి నిత్యం ఎంజీకేఎల్ఐ పథకం ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నప్పటికీ రాబోయే మూడు నెలలు కీలకం కానున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రజలకు తాగు నీరు అందించే కృష్ణానది జలాలు ఈ ఏడాది అనుకున్న దానికన్నా ఎక్కువగా అడుగంటి పోవడంతో కష్టాలు తప్పవని స్పష్టమవుతున్నది. ప్రస్తుతం వేసవి కాలం పంటలు చివరి దశలో ఉన్నప్పటికీ ఎంజీఎల్ఐ పథకం ద్వారా పంపింగ్ అయిన నీటి విడుదలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండి ఉన్నాయి.

కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్‌తో పాటు సింగోటం శ్రీవారి సముద్రం, జొన్నలబొగుడ రిజర్వాయర్‌లలో నీటి నిల్వ ఉన్నప్పటికీ రాబోయే పంటలకు రైతులకు అది పూర్తి సరిపోను ఉండదని రైతులు భావి స్తున్నారు. ఇప్పటికే ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా 47 టీఎంసీలు నీటి వినియోగం జరిగిందని, మరో వారం రోజుల పాటు ప్రాజెక్టు ద్వారా నీటి పంపింగ్ కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

ప్రారంభమైన తాగునీటి కష్టాలు..

వేసవి ప్రారంభంలోనే జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఇప్పటికే తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. రానున్న మూడు నెలల వేసవి కాలంలో తాగు నీటి కష్టాలు మరింత జఠిలం కానున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రజలకు తాగునీటి కష్టాలు తలెత్తకుండా అధికారులు ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం అనివార్యం కానుంది. ఇప్పటికే కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో 20 వార్డుల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రోజు విడిచి రోజు నీటి సరఫరా అవుతున్నా అవి కూడా సరిపడా కావడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా కొల్లాపూర్ మునిసిపాలిటీలో ప్రతి రోజు 45 లక్షల లీటర్ల నీటి వినియోగం ఉన్నప్పటికీ కేవలం 28 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా అవుతుందని, ఇది మునిసిపల్ ప్రజలకు సరిపోవడం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. మరో వైపు కొల్లాపూర్ మండల పరిధిలోని నల్లమల గ్రామాలైన ముక్కిడిగుండం, మొలచింతలపల్లి, కుడికిళ్ల, నార్లాపూర్ గ్రామాల్లో కూడా తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆయా గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగుతుంది. వేసవి ముగిసేంత వరకు ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



ముక్కిడిగుండం గ్రామంలో ప్రారంభమైన తాగునీటి కష్టాలు

విద్యుదాఘాతంతో ఇంటి సామగ్రి దగ్ధం

గండీడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంటి పైకప్పుతో పాటు ఇంటిలోని సామగ్రి అంటుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని చిన్నవార్వల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నవార్వల్ గ్రామానికి చెందిన బింగి బాలమ్మ సొంత ఇంటిలో బుధవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటి పైకప్పు వాసాలు అంటుకున్నాయి. దీంతో పాటు లోపల ఇంటిలో ఉన్న బియ్యం, జొన్నలు, బీరువాలో ఉన్న విలువైన చీరలు, నగదు కూడా అంటుకున్నాయి. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితురాలి కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఆర్థిక సహాయం చేయాలని బాధితురాలు, కుటుంబీకులు కోరారు. డిప్యూటీ తహసీల్దార్ మాధవిని సమాచారం అడగగా పంచనామా ప్రకారం బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు.

స్పందించిన అధికారులు

ఇంటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి పైకప్పు అంటుకున్న సంఘటన మండల తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి తెలియగానే మధ్యాహ్నం సమయంలో ఆర్ఐ యాసీన్ వచ్చి పంచనామా చేశారు. పై అధికారులకు విషయంపై నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



ఇంటి లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటి బయటకు తీసిన సిలిండర్ ఇతర సామగ్రి

దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు మంత్రి జూపల్లి

- నేడు ముంబయిలో ముగింపు కార్యక్రమం

కొల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : 20వ దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ముంబయికి వెళ్లనున్నట్లు నాగర్‌కర్నూలు జిల్లా టూరిజం శాఖ అధికారి కల్వరాల నరసింహ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగా ఏప్రిల్ 10న ముంబాయిలో జరిగే కాన్ఫరెన్స్‌లో మంత్రి జూపల్లి పాల్గొంటారని తెలిపారు. ముంబాయి పోవై లేక్‌లో ఈనెల 8వ తేదీన ప్రారంభమైన కాన్ఫరెన్స్ గురువారం ముగియనుంది. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని, తెలంగాణ నూతన పర్యాటక పాలసీతో పాటు ఏకో, టెంపుల్, మెడికల్ టూరిజంలో ఉన్న అవకాశాలను మంత్రి జూపల్లి ఈ కార్యక్రమంలో వివరించనున్నారని, అతిథి రంగంలో పెట్టుబడులకు అవకాశాలను వివరించి ఇన్వెస్టర్లను తెలంగాణకు మంత్రి ఆహ్వానించనున్నారని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సమీకరించడం ద్వారా 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా మంత్రి పని చేస్తున్నారని పేర్కొన్నారు.

బార్ లైసెన్సులకు దరఖాస్తు




బార్‌లైసెన్స్ కోసం ఎక్సైజ్ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్న వ్యాపారి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రెన్యువల్ చేసుకోని బార్‌ల స్థానంలో కొత్తబార్‌లు పెట్టుకునేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ నెల 26 తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించింది. అందులో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలో ఒక్క బార్‌కు దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. ఈ బార్‌ను లక్కీడిప్‌లో పొందితే సదరు వ్యాపారి బార్ లైసెన్సు పొందడం కోసం రూ.42 లక్షలను ప్రభుత్వానికి పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. బాలరాజు అనే మహబూబ్‌నగర్ వ్యక్తి బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- పీయూ కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్
- పీయూ అధ్యాపకుల ముందస్తు అరెస్టు



పీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేసిన రూరల్ పోలీస్ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకులను అందరిని క్రమబద్ధీకరించాలని పీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్రంలోని యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోషియేషన్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముట్టడికి బయలుదేరుతున్న నేపథ్యంలో పీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులును మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ అధికారులు సీఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు ముందస్తు అరెస్టు చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ యూనివర్సిటీలలోని కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, ఆ తర్వాత మిగిలిన ఖాళీలకు నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని అన్నారు. ఉదయం ముందస్తు అరెస్టు చేసిన అధ్యాపకులను సాయంత్రం విడుదల చేశారు.

క్రైం కార్నర్

నీటిలో మునిగి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బోరు మోటార్ మరమ్మతు కోసం వెళ్లి ఈతరాక ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుద్దారం గ్రామ పరిధిలో ఉన్న లక్ష్మీతండాకు చెందిన కిషన్ (39)కు గ్రామ పరిధిలో ఉన్న ధర్మ తండాకు చెందిన లక్ష్మితో పది సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ముగ్గురు మగ పిల్లలు. కిషన్, లక్ష్మి మధ్య చిన్న చిన్న గొడవలు తరచూ జరుగుతుండేవి. గొడవపడి ఐదు నెలల కిందట ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. కిషన్ మంగళవారం ఉదయం లక్ష్మీతండా పరిధిలో ఉన్న కుంటలో మోటార్ పని చేయడం లేదని, దాంట్లో దిగి రిపేరు చేస్తున్న సమయంలో ఈత రాక మునిగిపోయాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో కుంటలో కిషన్ మృతదేహం నీటిలో తేలియాడగా, గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ..


వీరన్న (ఫైల్)

రాజోలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ వ్యక్తి క్షణికావేశంతో పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి ఏఎస్‌ఐ ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలి గ్రామానికి చెందిన చంద్రకళ కుమారుడు వీరన్న (23) గత ఏడాది నుంచి పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడని, అందుకు మద్యం సేవించకుండా ఉండాలని తల్లి మందలించడంతో మద్యంకు బానిసైన వీరన్న ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో..

రేవల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏదుల మండలంలో చెన్నారం చెందిన అబ్దుల్ అలీమ్ (35) విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ అలీమ్ చెన్నారం గ్రామంలో చికెన్ షాప్ పెట్టుకొని వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కోళ్లను శుభ్రం చేసే పరికరాన్ని ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. భార్యతో పాటు కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

దాడిలో ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దర్గా దగ్గర ఇద్దరిపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై కేసులు నమోదు అయినట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీ దగ్గర ఉన్న సయ్యద్ మాసూప్ పీర్ దర్గా దగ్గరికి రాయిచూర్ నుంచి బుధవారం సయ్యద్ ఖాద్రీ పాష, సయ్యద్ హాజీఫ్ పాష, సయ్యద్ దౌలత్‌తో పాటు మరొకరు దర్శనం నిమిత్తం వచ్చారు. అయితే అదే సమయంలో అక్కడే ఉన్న మహబూబ్, మహమ్మద్‌రఫి, రియాన్‌లు మీరెందకు వచ్చారని వారిపై గొడవ పెట్టుకున్నారు.. దీంతో మాటా మాటా పెరిగి ఈ ముగ్గురు కలిసి సయ్యద్ ఖాద్రి పాష, సయ్యద్ హాజీఫ్ పాషలపై దాడి చేసి గాయపర్చడంతో మహబూబ్, మహమ్మద్‌రఫి, రియాన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు వంద రూపాయల జరిమానాతో పాటు ఒక రోజు జైలు శిక్షను ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా జి.పరుశరాములు కల్వకుర్తి హన్సెస్ చెర్లటిక్యాల కే.సురేష్, పెద్దాపురం చెందిన వారు మద్యం తాగి వాహనాలు నడిపినట్లు పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. వీరికి కోర్టులో ప్రవేశపెట్టగా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య ఒక్కొక్కరికి 100రూపాయల ఫైన్‌తో పాటు ఒక్క రోజు జైలు శిక్షను విధిస్తూ ఉత్తర్వులు వెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని వ్యవసాయ పొలంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 25 గొర్రెలను చంపిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు మేడమోని రేణయ్య రోజు మాదిరిగా గొర్రెలను పట్టణ సమీపంలోని నడింపల్లి గ్రామ శివారులో తన వ్యవసాయ పొలంలో షెడ్‌లో కట్టి ఇంటికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున వచ్చేసరికి గొర్రెలన్ని చెల్లాచెదురుగా చనిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. 25 గొర్రెల విలువ సుమారు రూ 2.5లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తరఫున తనకు సహాయం అందించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

పేకాట స్థావరంపై దాడి : 11 మందిపై కేసు

దేవరకద్ర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని పేకాటరాయుళ్లపై పోలీసులు దాడి చేసి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామంలో పేకాట ఆడుతుండగా పోలీసులకు సమాచారం అందించడంతో దాడి చేశారు. రూ.లక్షా 50 వేల నగదు, 9 ఫోన్లు స్వాధీనం చేసుకుని, 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి గోడను ఢీకొన్న బొలెరో వాహనం

బాలికకు తీవ్ర గాయాలు


ఇంట్లోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

అమరచింత, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని శివాజీ నగర్‌లో బొలెరో వాహనం అదుపు తప్పి ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. ఇంటి నిర్మాణం కోసం బొలెరో వాహన డ్రైవర్ ఐరన్ వేసుకుని వెళ్తుండగా శివాజీనగర్‌లోని మలంగ్ ఇంటిపైకి అదుపు తప్పి వేగంగా గుమ్మం వద్ద గోడకు ఢీకొట్టింది. దీంతో గోడ పక్కనే ఆడుకుంటున్న బాలికపై రాళ్లు పడ్డాయి. కాలికి తీవ్ర గాయం కావడంతో హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాలికను వనపర్తికి తరలించారు.

వేసవికాలం... తీరుతున్న దాహం


మానవపాడు మండలం, పెద్దపోతుల పాడులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

- ఏప్రిల్, మే నెలల్లో చలివేంద్రాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- గద్వాల జిల్లాలో 186 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన అధికారులు
- మిషన్ భగీరథ, శుద్ధి చేసిన నీటిని అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది
- గ్రామ, మండలాలకు వచ్చే ప్రయాణికులకు దాహం తీరుస్తున్న చలివేంద్రాలు


ఉండవల్లి మండలం, బొంకూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

అయిజ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేసవి కాలం ప్రజలు ఎదుర్కొంటున్న దాహార్తికి ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రతీ సంవత్సరం వేసవి కాలం ఏప్రిల్, మే నెలల్లో మండే ఎండల కారణంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా దాహం వేసినప్పుడు తాగునీటికి ఇబ్బందులు పడటం సర్వసాధారణం. ఒక గ్రామం వారు మరో గ్రామానికి వ్యక్తిగత పనుల మీద వెళ్లినప్పుడు కానీ, మండల కేంద్రాలకు వివిధ అవసరాలకు వచ్చే వారికి కానీ దాహం వేస్తే హోటళ్లను ఆశ్రయించటమో, డబ్బులు పెట్టి తాగునీటిని కొనుక్కోవటమో చేయాల్సి వచ్చేది. కానీ గత నెల 21వ తేదీన తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆయా జిల్లా కలెక్టర్‌లకు జారీ చేసిన ఉత్తర్వుల వల్ల ఇక ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రతీ గ్రామపంచాయతీలో ఒకటి, మండల కేంద్రాల్లో రెండేసీ చొప్పున చలివేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో గద్వాల జిల్లాలో 255 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే 186 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. 13 మండల కేంద్రాల్లో కూడా 8 చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పంచాయతీలు, మం డలాల్లో కూడా వీలైనంత త్వరగా వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్యూరిఫైడ్ వాటర్ సప్లైకే ప్రాధాన్యం

ప్రభుత్వం ద్వారా ప్రతీ మండల, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల్లో ప్యూరిఫైడ్ తాగునీటిని అందించేందుకు గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సరఫరా అవుతున్న శుద్ధిచేసిన మిషన్ భగీరథ నీటిని కానీ, అవి లేనిచోట ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేసికానీ చలివేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో చలివేంద్రంలో గ్రామీణ ఉపాధిహామీ కూలీ ద్వారా ఒక వ్యక్తిని నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేశారు. చలివేంద్రం ఏర్పాటుకు ఒక షెడ్డు, కుండలు, డ్రమ్ములు, బిందెలు, గ్లాసులు, టేబుల్ కొనుగోలుకు గానూ గ్రామపంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రయాణికులకు ఎంతో మేలు

సుదూర ప్రాంతాల నుంచి వ్యాపార, వ్యక్తిగత పనుల నిమిత్తం మండలాలకు, గ్రామాలకు ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. ఈ క్రమంలో వారికి దాహం వేసినప్పుడు ఉచితంగా తాగేనీరు ఇప్పటివరకు ఎక్కడ కూడా అందుబాటులో ఉండేది కాదు. దీంతో ఒక లీటర్ వాటర్ బాటిల్ రూ.20 పెట్టి కానీ, రూ.5 ఖర్చు చేసి లీటర్ లూజువాటర్ కొనుగోలు చేసి కానీ దాహం తీర్చుకునే పరిస్థితులు ఉండేవి. వారాంతపు సంతల్లో వ్యాపారాలు చేసుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చిరువ్యాపారులకు, వివిధ అవసరాలకు వచ్చి రోజంతా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ఉండేవారికి కేవలం తాగునీటికే రూ.50 నుంచి రూ.100 ఖర్చయ్యే పరిస్థితి ఉండేది. నేడు ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాల వల్ల అటువంటి వారికి వెసులుబాటు కల్పించినట్లే..

కొనలేక ఇబ్బంది పడేవాడిని



నేను వ్యవసాయ పనిముట్లకు, ఎద్దులకు అవసరమైన తాళ్లను అమ్మే వ్యాపారం చేసుకుంటూ జీవిస్తాను. ఆంధ్రప్రదేశ్‌లోని నందికొట్కూరు మా సొంత గ్రామం. 30 ఏళ్లుగా తెలంగాణలోని గద్వాల ప్రాంతంలో జరిగే వారాంతపు సంతల్లో తాళ్ల వ్యాపారం చేసుకుంటున్నాను. మానోపాడు, ఎర్రవల్లి, గద్వాల, అయిజ, శాంతినగర్ లాంటి పట్టణాల్లో జరిగే సంతల్లో ఏటా వేసవి కాలం తాగునీటికి అనేక ఇబ్బందులు పడేవాణ్ని. రోజుకు తాగునీటికోసం వంద రూపాయల వరకు ఖర్చు చేసేవాడిని. 10 రోజులుగా చూస్తున్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాల ద్వారా దాహార్తిని తీర్చుకుంటున్నాను.

- శ్రీనివాసులు, నందికొట్కూరు, (కర్నూలు జిల్లా).

మిగిలిన చోట్ల ఏర్పాటుకు చర్యలు



తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలతో ప్రతీ గ్రామంలో ఉచిత చలివేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. మండల కేంద్రాల్లో రెండు చొప్పున, అవసరమున్న చోట మూడు కానీ ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేశాం. చలివేంద్రాల నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలకు అప్పగించటం జరిగింది. ఉపాధి హామీ కూలీ, పంచాయతీ శానిటేషన్ సిబ్బంది, ట్రాక్టర్ ట్యాంకర్ల సాయంతో శుద్ధిచేసిన మిషన్ భగీరథ నీటిని, ఫిల్టర్ వాటర్‌ను అందించాలని ఆదేశించాం. ఇప్పటికే 186 గ్రామపంచాయతీల్లో ఉచిత చలివేంద్రాలను ఏర్పాటు చేశాం. మిగిలిన చోట్ల త్వరలో ప్రారంభిస్తాం.

- నాగేంద్రం, ఇన్‌చార్జి డీపీవో, (గద్వాల జిల్లా)

టీ-సేఫ్‌గా..



● ప్రయాణంలో తోడుగా యాప్

- మహిళలకు ప్రయాణ సమయంలో మెరుగైన భద్రత
- ప్రయాణ పర్యవేక్షణ సేవల కోసం టీ సేఫ్ సర్వీస్



టీ సేఫ్ యాప్ ఫొటో

నారాయణపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత దృష్ట్యా పోలీస్‌శాఖ ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ప్రయాణ సమయంలో మెరుగైన భద్రత కోసం టీ సేఫ్ సర్వీసులను అమల్లోకి తెచ్చింది. తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా టీ సేఫ్ సర్వీసులను మొబైల్‌లో డయల్ 100 ద్వారా మహిళలు సేవలను వినియోగించుకోవాలి. ప్రయాణ భద్రత కోసం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రయాణించే సమయంలో పోలీస్ పర్యవేక్షణ కోసం మహిళలు డయల్ 100కు కాల్ చేస్తే తక్షణమే రక్షణ పొందవచ్చు. కాల్ చేసిన వెంటనే అత్యవసరం కోసం 1 నొక్కాలని, ప్రయాణ పర్యవేక్షణకు 8 నొక్కితే 4 డిజిట్ నెంబర్ పాస్‌వర్డ్ ఎంట్రీ చేయమని అడుగుతుంది. ఆ నాలుగు నంబర్ నొక్కగానే టీ సేఫ్ యాప్ కనెక్ట్ అయి మహిళల ప్రయాణానికి సంబంధించి పర్యవేక్షించడం జరుగుతుంది. ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి సంబంధిత ఫోన్‌కు హలో కాల్స్ వస్తాయి. సురక్షితంగా ఉన్నారా లేదా అడగడం జరుగుతుంది. సురక్షితంగా లేకపోతే సంబంధిత లోకేషన్‌ను పోలీస్‌లకు చేరవేస్తుంది. వెంటనే రక్షణ కల్పిస్తారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులపై ప్రయాణ సమయంలో ఆకతాయిల వేధింపులు అరికట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. తెలియని ప్రాంతాలకు ఒంటరిగా మహిళలు వెళ్తున్నప్పుడు ఈ యాప్ తోడుగా ఉంటుంది. గమ్య స్థానానికి వెళ్లే ముందు వివరాలను నమోదు చేసి మానిటరింగ్ రిక్వెస్ట్ పెట్టుకుంటే గమ్య స్థానం చేరు వరకు ప్రయాణ భరోసా అంతా పోలీసుల మీద ఉంటుంది. స్మార్ట్ ఫోన్ లేకపోయినా టీ-సేఫ్ సేవలను పొందవచ్చు. ప్రయాణానికి ముందు నెంబర్‌కు 100 డయల్ చేసి ఐవీఆర్ ద్వారా 8ను క్లిక్ చేసి వివరాలను తెలిజేస్తే సెల్ టవర్ ఆధారంగా వారి వివరాలను గుర్తిస్తారు. ఏ సమస్య ఎదురైనా పోలీసులు స్పందిస్తారు.

టీ-సేఫ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు, విద్యార్థులు ప్రయాణంలో తోడుగా ఉండే టీ-సేఫ్ యాప్‌ను సద్వినియోగం చేసుకొని భద్రంగా గమ్య స్థానాలకు చేరుకోవాలి. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ టీ-సేఫ్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

మరో అడుగు ముందుకు

- ఘటనా స్థలి సమీపానికి లోకో ట్రైన్ పునరుద్ధరణ
- కొనసాగుతున్న శిథిలాల తొలగింపు ప్రక్రియ
- మరోసారి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రత్యేక అధికారి


సొరంగం లోపల సహాయక చర్యలపై వివిధ బృందాలతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గడిచిన 46 రోజులుగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో నిరంతరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్న 18 విభాగాలకు చెందిన రెస్క్యూ సిబ్బంది బుధవారం మరో అడుగు ముందుకేశారు. టన్నెల్ లోపలి నుంచి మట్టిని టన్నెల్ బోరింగ్ మిషన్ విభాగాలను వేగంగా తరలించేందుకు కన్వేయర్ బెల్టును పునరుద్ధరించి రెస్క్యూ ఆపరేషన్‌లో మరింత కదలిక తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లోకో ట్రైన్ కూడా సంఘటన స్థలానికి మరింత చేరువ వరకు తీసుకెళ్లగలిగితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చుననే క్రమంలో పనుల్లో వేగం పెంచారు. కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ ప్రక్రియ ఒక వైపు కొనసాగుతుండగానే ప్రత్యామ్నాయంగా లోకో ట్రైన్ కూడా సంఘటన స్థలానికి సమీపంలో చేరవేయగలిగే విషయంలో విజయం సాధించారు.

రెస్క్యూ ఆపరేషన్‌కు ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో లోకో ట్రైన్ ఘటన స్థలం వరకు చేరింది. ఆ తర్వాత ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ వద్ద ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన రెస్క్యూ అధికారులతో సమీక్ష జరిగింది. ఎంత వరకు రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేయగలుగుతామనే అంశంపై శివశంకర్ ప్రత్యేక సమాచారాన్ని తీసుకున్నారు. ఇదే అంశాన్ని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాట్ మైన్స్ సీనియర్ శాస్త్రవేత్త ఈసీ నవీన్, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసులు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డిలు పాల్గొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



వనపర్తి అర్బన్/నారాయణపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎండలు కాస్త పెరిగాయి. ఏప్రిల్‌లో మండుతున్న ఎండలతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో గరిష్ఠం 40.9, కనిష్ఠం 25.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా కొత్తకోటలో 39.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వీపనగండ్ల మండలంలో 24.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 37.4, కనిష్ఠం 24.3 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 36 డిగ్రీలు, కనిష్ఠం 23 డిగ్రీలు నమోదైంది.

సజావుగా పదో తరగతి మూల్యాంకనం

- బుధవారానికి 33.63 శాతం పూర్తి
- స్పాట్‌ను పరిశీలించిన డీఈవో రమేష్‌కుమార్


నాగర్‌కర్నూల్ స్పాట్ సెంటర్ వద్ద ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసి అత్యవసర మందులను పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సజావుగా కొనసాగుతోంది. బుధవారం నాగర్‌కర్నూల్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ డీఈవో రమే ష్‌కుమార్ పరిశీలించారు. మూల్యాంకనం ప్రక్రియను పరిశీలించి స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. డీఈవో మాట్లాడుతూ మూల్యాంకనం కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 1,34,461 విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయని తెలిపారు. మూడో రోజు బుధవారం నాటికి 33.63 శాతం మూల్యాంకనం ప్రక్రియ పూర్తయ్యిందని వెల్లడించారు. తెలుగు 6767, హిందీ 6089, ఇంగ్లీష్ 4144, గణితం 7175, భౌతికశాస్త్రం 8331, జీవశాస్త్రం 5098, సాంఘికశాస్త్రం 5908 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయ్యిందని పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 లోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, అత్యవసర మందులను పరిశీలించారు. డీఈవో వెంట జిల్లా పాఠశాల పరీక్షల నిర్వహణ అధికారి రాజేశేఖర్‌రావు, అసిస్టెంట్ క్యాంప్ అధికారి కురుమయ్య, యాదగిరి, పర్యవేక్షకులు నాగేందర్, లతాదేవి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ

మహబూబ్‌నగర్‌లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆర్జేడీ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. స్పాట్ కేంద్రంలో ఉన్న గదులను ఆమె పర్యవేక్షించారు. జవాబు ప్రతాలు మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించాలని, అసత్యం వహించవద్దని సూచించారు. మూల్యాంకనం జరుగుతున్న తీరుపై డీఈవో ప్రవీణ్‌కుమార్, పరీక్షల విభాగం అధికారి కమాలకర్‌రావులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా జవాబుపత్రాల మూల్యాంకనం జరిగేలా చూడాలని సూచించారు. పలు అంశాలపై చర్చించారు. మూడో రోజు పదో తరగతి మూల్యాంకనం సజావుగా సాగింది. డీఈవో దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. స్పాట్ కేంద్రాల్లో తెలుగు సబ్జెక్టు స్పెషల్ అసిస్టెంట్ కొరత ఉండటంతో వారు సర్దుబాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపూర్ గ్రామ సమీపంలో ఉన్న దుందుభీ వాగులో నుంచి రాజు అనే వ్యక్తి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం ఇసుకను తరలిస్తుండడంతో యాదిరెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనానికి సంబంధించి వివరాలు తెలుసుకోగా, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తేలింది. దీంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసిన అనంతరం రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు బ్యాగుల అందజేత

మిడ్జిల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం గ్రామానికి లక్ష్మీ కుమారుడు ఆర్యన్ జన్మదిన సందర్భంగా బ్యాగులను పంపిణీ చేశారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

భూత్పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటి దగ్గర గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బస్వరాజుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కోయిలకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శైలశ్రీ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం వారోత్సవాల్లో పాల్గొని, మాట్లాడారు. సూపర్‌వైజర్ రత్నమాల, హెచ్ఎం వీరయ్య, జయమ్మ, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

తిరుమలలో హరినామ సంకీర్తన

కోయిలకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ మల్లికార్జున స్వామి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన మండలి అధ్యక్షుడు స్వామి, సభ్యులు రాంరెడ్డి, నరసింహచారి, బాలయ్య, రామయ్య, వడ్డరాజ్, హన్మిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రీమాస్ మెయింటనెన్స్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ కోత విధిస్తున్నట్లు సెక్షన్-1 ఏఈ శంకరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పట్టణంలోని 11కేవీ యంసీ ఫీడర్ చెట్ల కత్తిరింపు చేస్తున్నట్లు తెలిపారు. భూత్పూర్ రోడ్, అదర్శనగర్, డబుల్ బెడ్‌రూం, బాలాజీనగర్, మదురానగర్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

17న నీట్ మాక్ టెస్టు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలలో ప్రవేశాల కోసం మే 4న నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 17 నీట్ మాక్ టెస్టు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు 9133005544 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో త్వరలో ప్రారంభించనున్న లెర్నింగ్ సెంటర్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత గల అభ్యర్థులు పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేసేందుకు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ ఆర్యన్ ఎంటర్‌ప్రైజ్‌లో శ్రీనివాస్‌కు దరఖాస్తులు అందజేయాలని, ఎంఎస్సీ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు.

ప్రారంభమైన ఎస్ఏ-2 పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఎస్ఏ-2 బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మెద్యూల్ ప్రకారం అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో డీసీఈబీ రూపొందించిన ప్రశ్నపత్రం తో ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మూసాపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములలో బుధవారం ఆర్బీఐ, ఎస్‌బీఐ సంయుక్త సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మూసాపేట టీజీబీ బ్యాంకు మేనేజర్ అరుణ్‌తో పాటు ఎఫ్‌డీ, ఆర్‌డీ డిపాజిట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, బ్యాంకు రుణాలు, బ్యాంకు బీమా, రాయితీ పథకాల గురించి వివరించారు. అక్షరాస్యత నిపుణులు శశికూరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎస్‌బీఐ ప్రతినిధులు అరుణ్‌కుమార్, కురుమయ్య సీసీలు పాల్గొన్నారు.

నేడు ధాత్రి సమగ్ర తల్లిపాల నిల్వ కేంద్రం ప్రారంభం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఉదయం 10 గంటలకు సుషేన్ హెల్త్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ధాత్రి సమగ్ర తల్లిపాల నిల్వ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం దివిటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.

ప్రతీ గింజను కొంటాం

» ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి » వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



గుడిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/మూసాపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ గింజను కొంటామని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చౌదర్‌పల్లి, హజిలాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యం తేమ శాతం 13 లోపు ఉండాలి, తాలు, మట్టిపెళ్లు, గడ్డిపోచలు లేకుండా శుభ్ర పరిచి, తూర్పారబట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందుకోవాలన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అధికారుల మండలం గుడిబండ, శాఖాపూర్ గ్రామాల్లో ఐకేపీ ద్వారా, మూసాపేట మండలం పోల్కంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో జానంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పాల్గొని, ప్రారంభించారు. తహసీల్దార్ రాజు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, తోట శ్రీహరి, మాజీ ఎంపీపీలు బర్ల కృష్ణయ్య, నాగార్జునరెడ్డి, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గండీడ్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెన్నచేడ్, గండీడ్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. అదే విధంగా వెన్నచేడ్‌లో రైస్‌మిల్లుతో పాటు గండీడ్‌లో ప్రాథమిక సహకార సంఘం భవనానికి భూమి పూజ చేశారు. మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీని వాసరెడ్డి, మాజీ సర్పంచు పుల్లారెడ్డి, అనంత లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు వెంకట్‌రాం రెడ్డి, ఆశన్న, ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

జడ్చర్ల అభివృద్ధికి రూ.100 కోట్లు తెస్తా

» ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి » పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణ అభివృద్ధికి ఈ ఏడాదిలోనే రూ.100 కోట్ల నిధులు తీసుకొస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. జడ్చర్ల మునిసిపాలిటీలో బుధవారం తెలంగాణ పట్టణ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.7.44 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్చర్ల మునిసిపాలిటీలోని అన్ని వార్డులను పార్టీల కతీతంగా అభివృద్ధి పట్టణంలోని రోడ్లలో వరం నీళ్ల నిలవకుండా స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ నిర్మాణాలకు రూ.14 కోట్లు మంజూరీ అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో తమకు ప్రాధాన్యత ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు బాధపడుతున్నారంటూ చైర్మన్ తన దృష్టికి తీసుకువచ్చారని, బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 3వ వార్డులో రూ.1.14 కోట్లతో కేటాయించామన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ నిధులు అదనంగా రూ.70కోట్లు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరామని, త్వరలోనే నిధులు మంజూరీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి దక్కనున్న మంత్రి పదవి

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కనున్నదని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్వాల్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గం, రాజాపూర్ మండలం చొక్కంపేట, తిర్మలాపూర్, దొండ్లపల్లి, రాయపల్లి గ్రామాల పరిధిలో దాదాపు 700 ఎకరాల భూమిని, ఓబుల్లు ఉన్నా సాదాబైనామా పేరుతో కొందరు కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ హమ్లెట్‌లోని ఖానాపూర్‌లో 315 ఎకరాలు దేశ్‌ముఖ్ పేరుతో ఉన్నాయని, వాటిని దున్నుకుంటున్న వారికే ఇవ్వాలని ఇప్పటికే కోరినట్లు చెప్పారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



మిన్గోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

దేవరకద్ర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మీన్గోనిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, సీకులు, సిమెంట్, ఇసుక, కంకర, వంటివి నాణ్యమైనవి వాడాలన్నారు. కాగా గ్రామానికి 82 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 24 ఇళ్ల నిర్మాణ పనుల ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్‌ఐ శరత్ ఉన్నారు.

22 వరకు పోషణ అభియాన్ కార్యక్రమం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో పోషణ పక్షం పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, అదనపు డీఆర్‌డీవో భోజప్ప పాల్గొన్నారు.

చంద్రరాజేశ్వరరావుకు నివాళి

పాలమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు విలువలకు మారుపేరు చంద్రరాజేశ్వరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చంద్రరాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

ఎల్ఓసీ అందజేత

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. జడ్చర్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం మండలంలోని 23 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు బుర్ర వెంకటయ్య అందజేశారు.

● మిడ్జిల్ : మండలంలోని మున్ననూర్, బోయిన్‌పల్లి గ్రామాల్లో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయా గ్రామాల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. బోయిన్‌పల్లిలో నరేష్‌గౌడ్, రేణుకమ్మకు అందజేశారు.

డబ్బాల తొలగింపు

మిడ్జిల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న దారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని పలు మార్లు కోరినా, ఫలితం లేకపోవడంతో బుధవారం అధికారులు రంగంలోకి దిగారు. ఎక్స్‌కవేటర్, క్రేయిన్ సహాయంతో డబ్బాలను తొలగించారు. ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ రాజు, సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివనాగేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో ఈ సంఘం జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ యుగంధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, గోనేల శ్రీధర్, భూపాల్ సింగ్, రాంచందర్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

రాజాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇద్గాన్‌పల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్థులు చందాలు వేసి రూ.4 లక్షల నిధులు సమకూర్చుకున్నారు. బుధవారం సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో ఎస్సైకి చెక్కు అందజేశారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



కొత్తూరులో జైభీం యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూత్పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాటికొండ, కొత్తూరు గ్రామాల్లో జైభీం, జైబాపు, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. రైతులకు, సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం పట్టుదలతో ముందుకెళ్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, తాటికొండ రఘునందర్‌రెడ్డి, కొప్పెల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పుల్లప్ప, బైరు శ్రీనివాస్, వెంకటేష్, మన్నెమయ్య, వెంకటేష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సాక్షరత కార్యక్రమం

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో బుధవారం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ పథక పరిచయం కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవ ప్రాముఖ్యత, శుభ్రత గురించి వివరించారు. ఆలూరి గ్రామంలోని కుటుంబాల జీవన శైలి, ఉపాధి మార్గాలు, విద్యాస్థాయి, ఆరోగ్య పరిస్థితులు, గృహ వసతులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై సర్వే నిర్వహించారు.

తెలంగాణలో లాక్రోస్ క్రీడకు ప్రాముఖ్యత



ఏపీ జితేందర్‌రెడ్డితో లాక్రోస్ క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో లాక్రోస్ క్రీడను అభివృద్ధి పరుస్తామని రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, రాష్ట్ర ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో లాక్రోస్ క్రీడాకారులు, రాష్ట్ర సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గచ్చిబౌలి స్టేడియంలో లాక్రోస్ ఆట ప్రాక్టీస్ కోసం మైదానాన్ని ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో లాక్రోస్ నేషనల్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. తెలంగాణ లాక్రోస్ అకాడమీ అధ్యక్షుడు బాసుపందర్, ప్రధాన కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సహకరిస్తాం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సహకరిస్తామని ఎస్పీ జానకి అన్నారు. బుధవారం జిల్లా వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ మద్ది మోహన్ చంద్, ఉమ్మడి జిల్లా చైర్మన్ మదుగు శివ శంకర్, వైస్ చైర్మన్ రాజసింహుదులు ఈ సందర్భంగా ఎస్పీని కలిసి జిల్లా నూతన కమిటీ వివరాలను సమర్పించారు. జిల్లా పోలీస్‌శాఖ తరఫున సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జుబేర్‌కర్ అలీ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో భవిష్యత్‌కు ముప్పు : ఎస్పీ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో యువత భవిష్యత్‌కు ముప్పు ఏర్పడుతోందని, యువత బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడొద్దని ఎస్పీ జానకి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైన క్రికెట్, మరే ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవడంతో పాటు అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభమైందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు సైతం వారి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడినట్లు గుర్తిస్తే డయల్ 100తో పాటు 8712659360 సమాచారం ఇవ్వాలన్నారు.

గ్యాస్ సిలిండర్ రేట్లు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ రేట్లను తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి చంద్రకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్ రేట్లు తగ్గించాలని ధర్నా చేపట్టారు. పేద, మధ్య తరగతి ప్రజలపైన భారం మోపటం సరికాదన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలు అందజేయాలన్నారు. రాజ్‌కుమార్, జయమ్మ, షాహిదాబేగం, కాన్సి, చిత్ర, భాగ్య పాల్గొన్నారు.

● హన్వాడ : కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హన్వాడలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మండల నాయకులు రాములు, మాజీ సర్పంచు బాలకిష్టయ్య, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

త్వరలోనే పార్యాంశంగా వ్యాయామ విద్య

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే వ్యాయామ విద్య పాఠ్యాంశంగా రాబోతుందని పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ అన్నారు. జడ్చర్లలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం నియోజకవర్గ స్థాయి వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నూతన విద్యావిధానంలో వ్యాయామ విద్య పాఠ్యాంశంగా రావడానికి దేశంలోని 7 రాష్ట్రాలు మాత్రమే సమ్మతి తెలియచేయాల్సి ఉందని, మిగతా రాష్ట్రాలు అన్ని అంగీకరించాయని వివరించారు. ప్రతీ పాఠశాలకు రూ.50 వేలు క్రీడా నిధిని కేటాయించాలని కోరారు. పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి మొగులాల్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మోయిన్, రవికుమార్, శ్రీనివాసులు, విజయ్, సందీప్, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.

కనుల పండువగా వీరప్పయ్యస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

దేవరకద్ర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వెలసిన ఈశ్వర వీరప్పయ్య స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామి రథోత్సవాన్ని రంగురంగుల పూలతో అలంకరించి, స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవంపై ఉంచి ముందుకు లాగారు. అదే విధంగా మధ్యాహ్నం స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ నరసింహా రెడ్డి, అర్చకులు నాగరాజు, నాగభూషణ్ పాల్గొన్నారు.

బాలుర జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల అభివృద్ధిపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు కోసం గతేడాదిలో ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దీంతో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు దృష్టి సారించిన బాలుర జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్, అదనపు గదుల నిర్మాణం, టాయిలెట్లకు రూ.2 కోట్లు, అదే విధంగా ఒకేషనల్ కళాశాలలో ల్యాబ్, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్ కోసం రూ.3.10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మూల్యాంకనం రెమ్యూనరేషన్ పెంచాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ పెంచాలని కోరుతూ బుధవారం పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, నాయకులు నర్సింహులు ఆర్జేడీ విజయలక్ష్మితో పాటు డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పెషల్ అసిస్టెంట్‌కు రోజుకు రూ.1000 చెల్లించాలని, స్కూల్ అసిస్టెంట్‌కు ఇచ్చే డీఏ రూ.1000 ఇవ్వాలని, అదే విధంగా మూల్యాంకనం చివర రోజునే అందించాలని కోరారు. అంతకుముందు డీఈవోకు టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, ధనుంజయ్ రెమ్యూనరేషన్ పెంచాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

మహమ్మదాబాద్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాయపల్లి, శేరిపల్లి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పలు విషయాలను వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెనుకబడిన వారిని ఆదుకుంటాం

మహమ్మదాబాద్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనందిస్తుందని పరిగి ఎమ్మెల్యే టీరామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన తలారి శివకు సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.40 లక్షల చెక్కును బాధితుడికి అందజేశారు.

వైద్య శిబిరం విజయవంతం

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మాపూర్‌లో బుధవారం ఎంవీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం ఎస్వీఎస్ మెడికల్ కళాశాల సౌజన్యంతో హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ చెకప్‌లు అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. లా ల్యాండ్‌తో పాటు సోషల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజుల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంపు



మాట్లాడుతున్న ఎంఈవో మంజులాదేవి

జడ్చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవికాలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మంజులాదేవి పేర్కొన్నారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆటలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై జడ్పీహెచ్ఎస్ (కావేరమ్మపేట), జడ్చర్ల మినీ స్టేడియంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించే యూనిఫాం క్లాత్ మండల కేంద్రానికి వచ్చిందని, విద్యార్థుల కొలతలకు సంబంధించి టైలర్లకు (ఎస్‌హెచ్‌జీ) ఇవ్వాలని, యూనిఫాం క్లాత్‌కి సంబంధించిన వివరాలు ఐఎస్ఎంఎస్ వెబ్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఎస్ఏ-2 పరీక్షలు టైం టేబుల్ ప్రకారం నిర్వహించాలని, మూల్యాంకనం చేసి, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యాసంవత్సరం చివరి రోజున తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందించాలన్నారు. ఎంఈవో కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటప్రసాద్, రిసోర్స్ పర్సన్ నాగరాజు పాల్గొన్నారు.